ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



మద్దూరు ఎంపీపీపై అట్రాసిటీ కేసు

మద్దూరు, జనవరి 9 : ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు మద్దూరు షేక్ యూనస్ అహ్మద్ అలీ మంగళవారం తెలిపారు. దళితబంధు ఇప్పిస్తానని వసూలు చేసిన కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి డబ్బు తిరిగి ఇవ్వమన్నందుకు.. 'అప్పు ఉన్నానా, అంతు చూస్తాను' అని బెదరింపులకు పాల్పడ్డాడని నర్సాయపల్లి గ్రామానికి చెందిన ముత్యాల కిషన్, చిలుక ప్రశాంత్ కుమార్ ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రసాభాస

వాడీవేడిగా సాగిన జడ్పీ సర్వసభ్య సమావేశం



బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు, కాంగ్రెస్ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మధ్య వాగ్వాదం

- బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యుల మధ్య వాగ్వాదం
- 19 అంశాలపై కొనసాగిన చర్చ
- పలు తీర్మానాలు ఆమోదించిన జడ్పీ చైర్‌పర్సన్
- శాఖల పనితీరుపై దుబ్బాక ఎమ్మెల్యే అసంతృప్తి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, జనవరి 9 : కొత్త ప్రభుత్వం ఏర్పాటయ్యాక తొలిసారిగా నిర్వహించిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాడీవేడీగా సాగింది. మంగళవారం సిద్దిపేటలోని విపంచి టౌన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అధ్యక్షత వహించారు. కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరయ్యారు. ఉదయం 10.30గంటలకు ప్రారంభమైన సమావేశం మధ్యాహ్న భోజన సమయందాకా కొనసాగింది. 19 అంశాలపై చర్చ కొనసాగగా బీఆర్ఎస్ సభ్యులు, కాంగ్రెస్ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి మధ్య పలు అంశాలపై వాగ్వాదం నెలకొన్నది.

తొలిసారి ఎక్కువ అంశాలపై చర్చ

జిల్లా పరిషత్ ఏర్పాటైనప్పటి నుంచి ప్రతీ 3 నెలలకు ఒకసారి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో మినహా దాదాపు సమావేశాలు జరిగాయి. వచ్చే ఏప్రిల్ నెలతో జడ్పీ సభ్యుల ఐదేళ్ల గడువు పూర్తవుతుంది. ఈలెక్కన మరొక్కసారి మాత్రమే సర్వసభ్య సమావేశం జరిగే అవకాశం కనిపిస్తోంది. ఇదిలా ఉంటే ప్రతీ సమావేశంలోనూ కేవలం 10 శాఖల నుంచి 12 శాఖల మీదనే చర్చ కొనసాగిన సందర్భాలు ఉన్నాయి. ఒక్కోసారి ఐదారు శాఖల చర్చకే పరిమితమైంది. కానీ తాజా సమావేశంలో 19 అంశాలపై చర్చించారు. వ్యవసాయ శాఖతో మొదలై ఉద్యానవన, పశుసంవర్ధక, విద్యా, వైద్య, ఆరోగ్యం, ఆయుష్, ఉపాధిహామీ, బీసీ సంక్షేమం, ఎస్సీ కార్పొరేషన్, నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, నేషనల్ హైవే, విద్యుత్, స్త్రీ శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమం, పౌరసరఫరాల శాఖలపై చర్చ నిర్వహించారు. అయితే మధ్యాహ్న భోజన సమయం తర్వాత కూడా సమావేశం జరిగితే మరో నాలుగైదు శాఖల సమీక్ష పూర్తయ్యేది. కానీ అంతటితోనే ముగించారు.

అధికారులపై మండిపాటు

వైద్యారోగ్య శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు పెట్టిస్తామని డబ్బు తీసుకుంటున్నారని, దీనికి అధికారులు వత్తాసు పలుకుతున్నారని జడ్పీటీసీ కొండల్‌రెడ్డి ఆరోపించారు. పత్రికా ప్రకటనలు ఇవ్వకుండానే మందులు కొనుగోలు చేస్తున్నారని విమర్శించారు. సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో భోజనం సరిగా పెట్టడం లేదన్నారు. ఆయుష్ ఆస్పత్రుల్లో పేషెంట్లు లేకున్నా తమ ఉద్యోగాలు కాపాడుకునేందుకు పేషెంట్లు వచ్చినట్లు తప్పుడు రిపోర్టులు రాస్తున్నారని కొండల్‌రెడ్డి చర్చకు తెచ్చారు. దీనిపై విచారణ చేయాలని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల లెక్క తేటతెల్లం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి సైతం అధికారులను ప్రశ్నించారు.

అభివృద్ధిని కొనసాగించాలి : జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

ప్రజల ఆకాంక్షల మేరకు అధికారులు జిల్లా అభివృద్ధిని కొనసాగించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ రోజాశర్మ పిలుపునిచ్చారు. జిల్లాలో చేపట్టిన నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. గత సమావేశంలో చర్చించిన అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అప్పటి సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపించారని ప్రశ్నించారు. ప్రస్తుత సమావేశంలోనూ శాఖల నిర్వహణపై సమీక్షించిన అంశాల గురించి వచ్చే సమావేశంలో సమాధానం చెపాల్సి ఉంటుందని సూచించారు. కాగా బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని సభ్యులు చేసిన తీర్మానాన్ని ఆమోదించారు.

గ్రామాల్లో పర్యటించాలి : ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చాలా మంది జిల్లాస్థాయి అధికారులు సిద్దిపేట జిల్లా కేంద్రానికే పరిమితమవుతున్నారని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లాలోని మారుమూల గ్రామాలకు వెళ్లినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. కార్యాలయాల్లో విధులు నిర్వహించడం, సిద్దిపేట చుట్టుపక్కలా ఒకట్రెండు మండలాలకు వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. ఇలా కాకుండా ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి వెళ్లాలని, అధికారులపై ప్రజల్లో విశ్వాసం ఉండేలా వ్యవహరించాలని కోరారు. దుబ్బాక ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఇక ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు కావాలని కోరారు.

బీఆర్ఎస్ వర్సెస్ కొండల్‌రెడ్డి

జిల్లా పరిషత్‌లో కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్‌గా ఉన్న మద్దూరు జడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డికి బీఆర్ఎస్ పార్టీ సభ్యులకు పలు సందర్భాల్లో వాగ్వాదం చోటు చేసుకున్నది. ఆయా పార్టీల ఎన్నికల మేనిఫెస్టోలు, అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి విమర్శలు గుప్పించుకున్నారు. బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, సుధాకర్‌రెడ్డి, మల్లేశం కొండల్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొండల్‌రెడ్డి సైతం ఎదురుదాడికి దిగడంతో వేదికపై ఉన్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వారించారు. దీంతో ఎమ్మెల్యేపైనా మండిపడడంతో బీఆర్ఎస్ సభ్యులు మళ్లీ వాగ్వాదానికి దిగగా సమావేశం రసాభాసగా మారింది. శాఖలపై చర్చలు జరుగుతున్న అన్ని సందర్భాల్లోనూ సమస్యలకు బదులుగా విమర్శలపైనే ఇరువర్గాలు తమ దృష్టిని కేంద్రీకరించాయి.



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, పక్కన ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, కలెక్టర్ ప్రశాంత్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి



రంగనాయకసాగర్ నీటిని విడుదల చేయాలని జడ్పీ సమావేశానికి వచ్చి వినతిపత్రం అందజేస్తున్న చిన్నకోడూరు మండల రైతులు

వరి నారుకు చలి దెబ్బ

- పసుపు రంగులోకి మారి ఎండుతున్న నారు
- నారుమడులకు సోకుతున్న తెగుళ్లు
- తగిన జాగ్రత్తలు పాటిస్తే రక్షణ

> రెండు ఎకరాల్లో నాట్లు వేయడానికి 20 రోజుల క్రితం తూకం పోశాను. నారు సరిగ్గా పెరగకపోగా, పసుపు రంగులోకి మారి కొద్దిమేర సచ్చిపోయింది. దీనితో చేసేదేమి లేక నాట్లు వేయడానికి నారు సరిపోతుందో లేదో అని మళ్లీ నాలుగు రోజుల క్రితం ఒక బస్తా తూకం పోశాను.
>
> – బాలమణి, రైతు, చిన్నకోడూరు

> చలి ప్రభావంతోనే నారు మడులు దెబ్బతింటున్నాయి. తగిన జాగ్రత్తలు పాటిస్తే రక్షించుకోవచ్చు. నిర్దిష్ట వేళల్లోనే నారుమడులకు నీటిని సరఫరా చేయాలి. చలి తీవత్ర ఎక్కువగా ఉండే చీకటి వేళ మడుల్లో నీళ్లు ఉండకుండా చూడాలి. తగిన ఎరువులను మోతాదుల్లో వాడడం వల్ల రక్షించుకోవచ్చు.
>
> – జయంత్ కుమార్, ఏవో, చిన్నకోడూరు

చిన్నకోడూరు, జనవరి 9 : యాసంగి వరి సాగు చేస్తున్న రైతులకు ప్రారంభంలోనే కష్టాలు మొదలయ్యాయి. కొందరు రైతులు ఇప్పటికే వరి నాట్లు వేయగా, మరికొంత మంది తూకాలు పోశారు. కొద్దిరోజులుగా చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వరినారుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. వరి తూకాలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. నారు సరిగా పెరగకపోవడం, పెరిగినా ఆకులు పసుపు రంగులోకి మారి చనిపోతున్నది. నారు పసుపు రంగులోకి మారుతుండటంతో మరోసారి తూకాలను చల్లుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు


- ఉదయం వేళలో బావి, బోరు నుంచి వచ్చే వేడి నీటిని నారు మడికి అందించాలి
- రాత్రి వేళ నారుమడిలో నీటిని నిల్వ ఉంచకూడదు
- నారుమడులపై కొంచెం ఎత్తులో కర్రలు ఏర్పాటు చేసి, వాటిపై టార్పాలిన్ కవర్లు కప్పాలి
- నారుమడి వద్ద కోడి ఎరువులను సంచులలో నింపి ఉంచడం వల్ల వెచ్చదనం అందుతుంది
- కార్బన్‌డైజిమ్+మనోకోజిప్ పౌడర్‌ను, అగ్రోమిన్ మాక్స్‌ను నారుమడికి నీటితో అందించాలి
- నాట్లు వేయడానికి వారం రోజుల ముందు కార్బోఫ్యూరాన్4జీ గుళికలను నారుమడిలో చల్లాలి. దీంతో గొట్టపు పురుగును నివారించవచ్చు.
- నారు మడి నుంచి నారును పీకీ కట్టలు కట్టిన తర్వాత నారు కొసలును తుంచి వేసి నాటు వేయాలి
- నాట్లు వేసే ముందు 15 లీటర్ల నీటిలో 30 గ్రామ్స్ బావిస్టిన్+, 30ఎంఎల్ ఫ్లోరో కలిపిన ద్రావణంలో నారు కట్టలు ముంచి తీయాలి. దీంతో గొట్టపు పురుగు, తెగుళ్ల సోకకుండా నివారించవచ్చు.



పెద్దకోడూరు శివారులో పసుపు రంగులోకి మారిన వరినారు

మల్లన్నగుట్టలను మింగేస్తున్నారు

- రిజర్వ్ ఫారెస్టును ఆనుకుని క్రషింగ్
- విచ్చలవిడిగా బ్లాస్టింగ్‌లు
- ప్రభుత్వ భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు





విచ్చలవిడిగా తవ్వుతుండడంతో కరిగిపోతున్న మల్లన్న గుట్టలు

దుబ్బాక, జనవరి 9 : ప్రశాంతంగా ఉండే అడవిలో కాసుల కక్కుర్తితో గుట్టలను తొలిచే ముఠాలు చేరాయి. దుబ్బాక మండలం చెల్లాపూర్ శివారులో మల్లన్న దేవుడు కొలువైన గుట్టలనే తోడేస్తున్నారు. స్టోన్‌క్రషర్ పేరుతో అడవిని యథేచ్ఛగా తవ్వుతున్నారు. దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని చెల్లాపూర్ శివారులో 683 సర్వే నంబరులో 30 ఎకరాల్లో దాదాపు పది ఎకరాలను ఒక సంస్థకు లీజుకు ఇచ్చారు. అయితే ఇక్కడ పరిమితిని దాటి మైనింగ్ చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై పలుసార్లు బీజేపీ నాయకులు సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు ఇచ్చి, ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయింది. ప్రముఖ పర్యావరణ వేత్త విశ్రాంత ఆచార్య డాక్టర్ కారంపూరి సుభాష్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

బ్లాస్టింగ్‌తో ధ్వంసం

మల్లన్నగుట్టల అడవిని ఆనుకుని ఉన్న సర్వే నంబర్‌లలో పదేళ్ల క్రితం కంకర యంత్రాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్నారు. గతంలో స్థానిక అవసరాలకు అనుగుణంగా మాత్రమే క్రషింగ్, మైనింగ్ సాగేది. కొన్నాళ్లుగా ఎల్కతుర్తి, మెదక్ జాతీయ రహదారి పనుల పేరుతో మరో సంస్థ క్రషింగ్‌ను ఏర్పాటు చేసింది. పాత సంస్థ అనుమతులతోనే మైనింగ్ తవ్వకాలను మొదలుపెట్టింది. వారి నుంచి కేవలం ముడి సరుకును తీసుకునే ఒప్పందాన్ని మాత్రమే కుదుర్చుకున్నారు. కానీ యథేచ్ఛగా బ్లాస్టింగ్‌లను చేస్తూ గుట్టలను ధ్వంసం చేస్తున్నారు. నాలుగు నెలల క్రితం రాత్రికిరాత్రే మైనింగ్ యాక్టు జీవోను తీసుకుని అటవీప్రాంతం సమీపంలో మైనింగ్ చేస్తున్నారు. అయితే రిజర్వ్ ఫారెస్టులోకి రాకపోకలు నిషేధించబడగా గుట్టలను తొలచి, ముడిసరుకు(బండలు) తరలించడానికి ఏకంగా దారిని ఏర్పాటు చేసుకున్నారు.

వన్యప్రాణులు విలవిల

మల్లన్నగుట్టలు రిజర్వ్ ఫారెస్టు సుమారు 1500 ఎకరాల వరకు ఉంటుంది. దుబ్బాక మండలం పెద్దచీకోడు శివారులోని 250, 375 సర్వే నంబరులో విస్తరించి ఉంటుంది. ఇక్కడ వివిధ జాతులకు సంబంధించిన వన్యప్రాణులు ఉన్నాయి. గుట్టలను బ్లాస్టింగ్ చేస్తుండడంతో ఇక్కడి వన్యప్రాణులు విలవిలలాడుతున్నాయి. అడవిలో తరుచూ కనిపించే చుక్కల దుప్పి, కొండగొర్రెలు, ఎలుగుబంటితోపాటు చిరుతపులి జంటలుండేవి. అందులో మగ చిరుత చనిపోయి ఉండవచ్చని స్థానికులు అంటున్నారు. వాటివెంట రెండు పిల్లలు కూడా ఉన్నాయని, కేవలం తల్లి, రెండు పిల్లలు మాత్రమే కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు. బ్లాస్టింగ్‌తో వన్యప్రాణుల సంచారం పూర్తిగా తగ్గింది.

రైతులకు అవస్థలు.. ధ్వంసమవుతున్న దారులు

రైతులకు కూడా అవస్థలు తప్పడం లేదు. బ్లాస్టింగ్ మూలంగా రాళ్లు పొలాలలో పడుతున్నాయి. క్రషింగ్‌తో వచ్చే దుమ్ము పొలాల్లో చేరి పంటలకు నష్టం వాటిల్లుతున్నది. రైతులు లబోదిబోమంటున్నారు. క్రషింగ్‌తో చెల్లాపూర్-ముస్తాబాద్ రహదారి వరకు దుమ్ము రావడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. మల్లన్న గుట్టల అడవి మొత్తం దుమ్ము కమ్ముకుంటుంది. టిప్పర్లతో వందలాది ట్రిప్పులతో కంకరరాళ్లను తరలించడంతో చెల్లాపూర్, దుబ్బాక రహదారి ధ్వంసమైంది. దుబ్బాక పట్టణంనుంచే టిప్పర్లు వెళుతుండడంతో మల్లయపల్లి పాత రహదారి పూర్తిగా చెడిపోయింది. ఇదిలా ఉండగా క్రషర్ అనుమతులపై అధికారులను సంప్రదిస్తే ఒకరు మరొక శాఖపై నెపాన్ని నెట్టుతున్నారు. అటవీ, మైనింగ్, కాలుష్య నియంత్రణ, రెవెన్యూ శాఖలు ఎవరికి వారు చేతులెత్తేస్తున్నారు.



మల్లన్న గుట్ట అటవీ ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న క్రషర్

ఔరా.. బుల్లి శాస్త్రవేత్తలు

- అబ్బురపరుస్తున్న 'బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని'

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని(2023-24) అబ్బురపరుస్తున్నది. మూడు రోజుల పాటు నిర్వహించే ఈ ప్రదర్శనకు సంగారెడ్డి శాంతి నగర్‌లోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్ వేదికైంది. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల నుంచి తీసుకొచ్చిన 761 ఎగ్జిబిట్లను ఈ సారి ప్రదర్శించారు. అందులో మికోన్నత పాఠశాలలు 101 ఉండగా, ఉన్నత పాఠశాలలు 657 ఉన్నాయి. సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ సొసైటీ అనే ప్రధాన అంశంపై నిర్వహిస్తున్న ఈ సైన్స్ ఫెయిర్ ఎంతో మందిని ఆలోచింపజేస్తున్నది. ఈ నెల 8 వ తేదీన ప్రారంభమైన బాల వైజ్ఞానిక్ ప్రదర్శిని నేటి(బుధవారం)తో ముగియనున్నది. రాష్ట్రంలో అన్ని జిల్లాలో జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన వర్చువల్‌గా నిర్వహిస్తుండగా, ఒక్క సంగారెడ్డి జిల్లాలోనే మాన్యువల్‌గా నిర్వహించడం విశేషం. విద్యార్థులు తమలో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికితీసి వివిధ రకాల ఎగ్జిబిట్లను ప్రదర్శింపజేశారు. అందులో కొన్ని ఇలా ఉన్నాయి.


స్తంభం ఎక్కకుండానే వీధి దీపాల రిపేర్



విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్‌మెన్‌లు చాల కష్టపడుతుంటారు. వీధి దీపాలు మార్చడం, రిపేర్స్ వచ్చినప్పుడు స్తంభం ఎక్కి రిపేర్ చేయాల్సి వచ్చేది. దీంతో తరుచూ ప్రమాదాలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో కరెంటు స్తంభం ఎక్కకుండా రిపేర్ చేయడానికి వీలుగా గుమ్మడిదల జడ్పీహెచ్ఎస్ 6వ తరగతి విద్యార్థిని లిఖిత, గైడ్ టీచర్ పి.శోభారాణి సహాయంతో ఎగ్జిబిట్‌ను రూపొందించారు. ఐరన్‌పోల్స్‌కి ఉండే స్క్రు ద్వారా పోల్‌ను కిందకు వంచి రిపేరైన తర్వాత యథావిధిగా ఫిట్ చేస్తారు. దీంతో లైన్‌మెన్‌కి పనిచేయడం సులభం అవుతుంది.

కాలుష్యం తగ్గించేలా..

కాలుష్యాన్ని తగ్గించేందుకు ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. పరిశ్రమలు, వాహనాలు నుంచి వెలువడే కాలుష్యంతో పాటు పంటలకు కృత్రిమ రసాయనాలను వాడటం వల్లా రోజురోజుకూ గ్లోబల్ వార్మింగ్ పెరిగిపోతున్నది. పొగను శుద్ధి చేసిన అనంతరం బయటకు పంపాలని, అందుకు మొక్కలు ఎక్కువగా నాటాలని, శీతలీకరణ పరికరాలను తక్కువగా వాడాలని చెప్పేలా దిగ్వాల్ జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విజయలక్ష్మి ఎగ్జిబిట్ రూపొందించింది.



యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించే ఎగ్జిబిట్

యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు..

రోడ్డు మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. యూటర్న్ వద్ద రోడ్డు ప్రమాదాలను నివారించే విధంగా జోగిపేట మహాత్మాజ్యోతిబాపూలే స్కూల్ విద్యార్థులు ఎగ్జిబిట్‌ను ప్రదర్శించారు. రోడ్డుపై ప్రయాణిస్తున్న క్రమంలో అకస్మాత్తుగా మలుపు వచ్చినపుడు కొద్ది దూరంలో స్పీడ్ బ్రేకర్ వేయాలి. స్పీడ్ బ్రేకర్‌కు వాహన టైర్ తాకగానే వాహనం ఎటువెళ్లాలో ఆ మలుపు దిశలో(రైట్-లెఫ్ట్) సిగ్నల్ లైట్లు వెలగడంతో పాటు పెద్ద శబ్దం వస్తుంది. అలాంటప్పుడు అటుగా ఎదురుగా వస్తున్న వాహన డ్రైవర్ అప్రమత్తమై వేగం తగ్గించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చు.

పంటల రక్షణకు ఎయిర్ గన్

అటవీ జంతువుల నుంచి పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయదారులు ఎంతో కష్టపడుతుంటారు. ఈ శ్రమ నుంచి తప్పించుకునేలా ఓ ఎగ్జిబిట్‌ను పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నేహ, భువనకృతి రూపొందించారు. ప్లాస్టిక్ పైపును రెండు అడుగుల పొడవులో గన్ మాదిరిగా తయారుచేసి ఓ పైపు చివరి కొన వద్ద రంధ్రం చేసి గొట్టం అమర్చాలి. ఆ గొట్టం పైభాగం నుంచి క్యాల్షియం కార్బైడ్ పౌడర్, నీరు వేసి మూత మూసేయడంతో ఎసిటలిన్ గ్యాస్ వాయువు వెలువడుతుంది. అపుడు పైపు మరో వైపు నుంచి 30 సెకన్లకు ఒక సారి లైటర్ వెలిగిస్తే పెద్ద శబ్దం వస్తుంది. ఆ శబ్దానికి అడవి పందులు, పక్షులు, కోతులు పంటల వైపు రాకుండా ఉంటాయి.



గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

జహీరాబాద్, జనవరి 9: జహీరాబాద్ పట్టణంలోని రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ క్రిష్ణవేణిని విధుల నుంచి తప్పిస్తు సాంఘీక సంక్షేమశాఖ గురుకులాల కార్యదర్శి డా.నవీన్ నికోలస్ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ కళాశాలలో మండలంలోని తూంకుంట గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థిని స్వప్న ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు మెదక్ రీజియన్ ఆర్సీవో భీమయ్య విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయడంతో అన్ని వివరాలను పరిశీలించిన గురుకులాల కార్యదర్శి డా.నవీన్ నికోలస్ ఆమెను విధుల నుంచి తప్పిస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశారు. కళాశాలలో సీనియర్ అధికారికి ప్రిన్సిపాల్ బాధ్యతలను అప్పగించారని కళాశాల సిబ్బంది తెలిపారు.

గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సమీక్ష


సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జనవరి 9: గణతంత్ర దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మైత్రీమైదానంలో ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను, విద్యాసంస్థల ప్రతినిధులను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదేశించారు. ఎమ్మెల్యే మంగళవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనే విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. విజేతలకు తాను సొంతంగా నగదు పురస్కారాలను అందజేస్తానన్నారు. సమావేశంలో జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ భాస్కర్, ఎంఈవో రాథోడ్, ప్రధానోపాధ్యాయులు, ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిధులిస్తాం

మనోరాబాద్ డిసెంబరు 9: అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం జెడ్పీ నిధుల నుంచి రూ. 15 లక్షల మంజూరు చేస్తానాన్ని జెడ్పీచైర్‌పర్సన్ హేమాలత శేఖర్‌గౌడ్ హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని చెట్లగౌరారం గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లేదని గ్రామస్థులు ఆమె దృష్టికి తీసుకురావడంతో ఆమె స్పందించారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ మధుకర్, వైస్ ఎంపీపీ విఠల్‌రెడ్డి, సర్పంచ్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లు జాగ్రత్త

చిలప్‌చెడ్, జనవరి, 9: వరినాట్లు వేసిన పొలాల పట్ల రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని ఏవో బాల్‌రెడ్డి సూచించారు. మండల పరిధిలోని అంతారం గ్రామంలో వరినాట్లు వేసిన పంట పొలాలను మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాతావరణం చల్లగా ఉన్న కారణంగా వరినాటు వేసిన పొలాల్లో అప్పుడప్పుడు నీరు తీసివేస్తుండాలన్నారు. తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వాడాలని సూచించారు.

187 కొత్త బస్సులకు ప్రతిపాదనలు

నారాయణఖేడ్, జనవరి 9: మెదక్ ఆర్టీసీ రీజినల్ పరిధిలో 187 కొత్త బస్సుల కోసం ప్రతిపాదనలు పంపామని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. ఖేడ్‌ను మంగళవారం సందర్శించిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం రీజినల్ పరిధిలో 557 బస్సులు ఉన్నాయన్నారు. రీజియన్ పరిధిలో 49 ఆర్టీసీ స్థలాల్లో షటర్లు నిర్మించి ఈ టెండరు ద్వారా లీజుకు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆమె వెంట ఆర్టీసీ డీఎం మల్లేశయ్య, పీఆర్వో పాండు, నెహ్రూనాయక్, తదితరులు ఉన్నారు.

లావుణి పట్టా భూముల్లో క్రషర్లు నడపొద్దు

కంది, జనవరి 9 : కంది మండలంలోని ఎర్దనూర్ శివారులో పేదలకు చెందిన లావుణి పట్టా భూముల్లో ఏర్పాటు చేసిన క్రషర్లను ఆయా శాఖల అధికారులు మంగళవారం పరిశీలించారు. క్రషర్లను తొలగించాలని గ్రామస్థులు ఆర్డీవోకు ఫిర్యాదు చేయడంతో అధికారులు క్రషర్లను పరిశీలించారు. క్రషర్లను తొలగించాలని నిర్వాహకులను రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ఆదేశించారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. క్రషర్లను పరిశీలించిన వారిలో ఆర్ఐ వెంకట్‌రాం రెడ్డి, ఇరిగేషన్ ఏఈ మజార్, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

పెద్దశంకరంపేట, జనవరి 9: కేంద్రప్రభుత్వ పథకాలపై వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా మంగళవారం పెద్దశంకరంపేట మండల పరిధిలోని జూకల్‌గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్రప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి మండల పరిధిలోని ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరించారు.

సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలి

● సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు



విద్యార్థి లోహిత్‌యాదవ్‌ను అభినందిస్తున్న గీత స్కూల్ యాజమాన్యం

మనోహరాబాద్, జనవరి 9: జనగామ పట్టణ పరిధిలో ఈనెల 12 నుంచి 14 వరకు జరిగే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాణించాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు సూచించారు. మనోహరాబాద్ మండలంలోని క్రీడా ప్రాంగణంలో వారంరోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడాకారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శ్యామ్ సుందర్‌శర్మ, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్, ఎస్‌ఐ హరీశ్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గీత స్కూల్ విద్యార్థి

తూప్రాన్, జనవరి 9: తూప్రాన్ గీత స్కూల్ విద్యార్థి నరాల లోహిత్‌యాదవ్ జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకట కృష్ణారావు తెలిపారు. ఈనెల 10న రాజస్థాన్ రాష్ట్రం బికనీర్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ అండర్-17 బాలుర విభాగంలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు. లోహిత్‌యాదవ్‌ను కరస్పాండెంట్ పీ.రామాంజనేయులు, చైర్‌పర్సన్ పీ.ఉష, డైరెక్టర్లు బీ.రాఘవేందర్‌గౌడ్, కే.నారాయణగుప్తా, పీఈటీలు శైలేందర్, కరుణాకర్ అభినందించారు.

తల్లి పాల నిల్వ కేంద్రం ప్రారంభం ఎప్పుడో?

● ఎంసీహెచ్‌లో ప్రారంభానికి నోచుకోని మదర్ మిల్క్ బ్యాంకు
● పనులు పూర్తై ఆరునెలలైనా అందుబాటులోకి రాని వైనం
● కేంద్రం ఏర్పాటుపై తల్లుల ఎదురుచూపులు
● వైద్య ఆరోగ్యశాఖ మంత్రి 'దామోదర్' దృష్టిసారిస్తే మేలు




సంగారెడ్డిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం, సంగారెడ్డి ఎంసీహెచ్‌లో ప్రారంభానికి నోచుకోని తల్లి పాల నిల్వ కేంద్రం

సంగారెడ్డి అర్బన్, జనవరి 9: సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేయతలపెట్టిన తల్లి పాల నిల్వ కేంద్రం(ల్యాక్టేషన్ మేనేజ్‌మెంట్ యూనిట్) ప్రారంభానికి నోచుకోవడం లేదు. పనులు పూర్తై, పరికరాలు చేరుకుని ఆరునెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఆరంభానికి కార్యరూపం దాల్చలేదు. మాతా శిశుఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్) లోని మొదటి అంతస్తులో మదర్ మిల్క్ బ్యాంకు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా రూ.3 లక్షల నిధులతో ఫర్నిచర్ పార్టీషన్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ తదితర ఆధునీకరణ పనులు పూర్తిచేశారు. రూ.9.59 లక్షల నిధులతో తల్లి పాల నిల్వకు సంబంధించిన పరికరాలను సమకూర్చారు. టీఎస్‌ఎంఎస్‌ఐడీసీ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో పనులు చేపట్టగా, ప్రారంభోత్సవానికి మాత్రం జిల్లా యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో ఈ కేంద్రాన్ని అందుబాటులోకి తెస్తారా? లేక కలగానే మిగిలిపోనుందా అన్న చర్చ సర్వత్రా జరుగుతున్నది.

తల్లీ, బిడ్డల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యమిచ్చిన అప్పటి సర్కారు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. అత్యవసర పరిస్థితులలో తల్లి పాల కొరతను తీర్చేందుకు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే తల్లీ, బిడ్డల క్షేమం కోసం ఎంసీహెచ్ కిట్, న్యూట్రిషన్ కిట్, అమ్మఒడి వంటి పథకాలను అమలు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే శిశువులకు పాల సమస్యను దూరం చేసేందుకు తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా తల్లుల్లో జన్యుపరమైన లోపాలు, ఒత్తిడి, వయస్సు ఎక్కువగా ఉన్నవారికి తల్లి పాలు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది. బరువు తక్కువగా పుట్టిన శిశువులు, నెలలు నిండకుండా జన్మించిన పిల్లలకు, తల్లి పాలు అందని శిశువులకు వీటిని ఉపయోగిస్తారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తల్లి పాల బ్యాంకుతో నవజాత శిశువులకు మరింత భరోసా దక్కనున్నది. పటాన్‌చెరు, సదాశివపేట, జహీరాబాద్, జోగిపేట, నారాయణఖేడ్ ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ఎంసీహెచ్‌లో ప్రసవమైన తల్లుల నుంచి వారి సమ్మతితోనే పాలను సేకరిస్తారు. శిశువు చనిపోయిన బాలింతలు, స్వచ్ఛందంగా వచ్చిన తల్లుల నుంచి పాలను సేకరించి వాటిని తల్లి పాల బ్యాంకులో భద్రపరుస్తారు. ఆధునిక పరికరాలు, సౌకర్యాలతో నిర్దిష్ట డిగ్రీల దగ్గర భద్రపర్చి, శుద్ధి చేసి అవసరమైన శిశువులకు అందిస్తారు. డెలివరీ సమయంలో ఉమ్మనీరు మింగడం, బరువు తక్కువగా పుట్టినవారు, పుట్టగానే ఏడవనివారు, ఇన్‌ఫెక్షన్ సోకిన వారికి ఈ పాలతో ఎంతో ప్రయోజనం కలుగనున్నది. తల్లి పాల సమస్యతో ఇబ్బందులు పడే బాలింతలు ఈ కేంద్రం ద్వారా ఉచితంగా తల్లి పాలు పొందవచ్చు. ఈ క్రమంలో తల్లి పాల నిల్వ కేంద్రం ఏర్పాటుకు ఎదురుచూపులు తప్పడం లేదు. కావున తల్లి పాల నిల్వ కేంద్రం అందుబాటులో తెచ్చేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ ప్రత్యేక చొరవ చూపాలని తల్లులు కోరుతున్నారు.

చిట్కుల్ ఎల్లమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో పరిశీలిస్తున్న పోలీసులు

చిలప్‌చెడ్, జనవరి 9: చిట్కుల్ గ్రామ శివారులో ఉన్న ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. మంగళవారం ఉదయం 9 గంటలకు పూజలు చేసేందుకు పూజారి జానమొల్ల పరశురాంగౌడ్ వెళ్లగా.. గుడి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా 4 కిలోల ఇత్తడి ఎల్లమ్మ, జమదగ్ని విగ్రహాలు, అమ్మవారి వెండి కండ్లు, హుండీలోని డబ్బులను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు తెలిపారు. పూజారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ మిస్బాఉద్దీన్ పేర్కొన్నారు.

సవాళ్లను ఎదుర్కొంటూ భారత్ అభివృద్ధి

● ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలి
● వోక్సన్ విశ్వవిద్యాలయ అంతర్జాతీయ సదస్సులో బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ



పలువురు ప్రతినిధులతో బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ

కోహీర్, జనవరి 9: భారత్-యూరోపియన్ యూనియన్ ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలని బెల్జియం మాజీ ప్రధాని వైవెస్ లెటెర్మీ అన్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కంకోల్ గ్రామ పరిధిలోగల వోక్సన్ విశ్వవిద్యాలయంలో మంగళవారం నిర్వహించిన 'భవిష్యత్తులో ఉన్నత విద్యను వ్యూహాత్మకంగా ప్రోత్సహించడం ఎలా' అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై కీలకోపన్యాసం చేశారు. భారత్-యూరోపియన్ యూనియన్ దేశాలు విలువలతో కూడిన ప్రజాస్వామ్య దేశాలు కనుక వీటి మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడాలన్నారు. ఉన్నత విద్య, వ్యాపార రవాణా, తదితర అంశాలలో ద్వైపాక్షిక సంబంధం మెరుగుపడినప్పుడే ఇరుదేశాల అభివృద్ధి రాబోయేరోజుల్లో సాధ్యమవుతుందని చెప్పారు. ప్రపంచ దేశాల సవాళ్లను ఎదుర్కొంటూ భారతదేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. భారతదేశంలో వివిధ రంగాల్లో ఉన్న ఔత్సాహికులకు మంచి ప్రోత్సాహం ఉన్నదని పేర్కొన్నారు. అంతేకాకుండా భారత్‌లో బహుళజాతి సంస్థల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయన్నారు. భవిష్యత్‌తరాలలో ఉన్నత విద్యను మెరుగుపరచడానికి భారత్-యూరోపియన్ యూనియన్ దేశాలు భాగస్వాములు కావాలన్నారు. రాబోయేరోజుల్లో ఉన్నత విద్యను మెరుగుపరచాలన్న ఆలోచనపై వోక్సన్ విశ్వవిద్యాలయ యాజమాన్యం ఈ సమావేశాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆలోచనాపరులు, విధాన నిర్ణేతలు, పరిశ్రమల ప్రతినిధులను ఒకచోట చేర్చడమే అంతర్జాతీయ సమావేశం ప్రాథమిక లక్ష్యమన్నారు. అనంతరం వోక్సన్ విశ్వవిద్యాలయం అవార్డును అందుకున్నారు. డాక్టర్ రెడ్డి ల్యాబ్స్ కో ఛైర్మన్, బెల్జియం గౌరవ కాన్సుల్ జనరల్ జీవీ.ప్రసాద్, ఏఐసీటీఈ మాజీ ఛైర్మన్, డాక్టర్ శంకర్ ఎస్.మంథా, వోక్సన్ యూనివర్సిటీ సీఈవో విశాల్ ఖుర్మా పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్

● సంగారెడ్డి డీఎస్పీ జే.రమేష్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి డీఎస్పీ రమేష్‌కుమార్

సంగారెడ్డి క్రైం, జనవరి 9: కంపెనీలలో పనిచేస్తున్న వారికి గంజాయి విక్రయిస్తున్న నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు సంగారెడ్డి డీఎస్పీ జే.రమేష్‌కుమార్ తెలిపారు. సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. పుల్కల్ మండలం మిన్పూర్‌కు చెందిన జెరువుల శ్రీను(46), పటాన్‌చెరు మండలం ముత్తంగికి చెందిన వడ్డె అశోక్(38), మిన్పూర్‌కు చెందిన రమావత్ అనిల్ జహీరాబాద్ మండలం మల్చెల్మతండాకు చెందిన బానోత్ శ్రీను, నాగిల్‌గిద్ద మండలం మాచేపల్లితండాకు చెందిన రాథోడ్ రవీందర్, గైరాన్‌తండాకు చెందిన రాథోడ్ హరి, కర్ణాటక రాష్ట్రానికి చెందిన మోహన్, మిన్పూర్‌కు చెందిన బేగరి నర్సింహులు కలిసి ఒరిస్సా, భద్రాచలం, ఆంధ్రా సరిహద్దు నుంచి గంజాయి తీసుకొచ్చి జహీరాబాద్, ఇస్నాపూర్, సంగారెడ్డి పరిసర ప్రాంతాల్లోని కంపెనీల్లో పనిచేస్తున్న వారికి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం జెరువుల శ్రీను, వడ్డె అశోక్‌లు సంగారెడ్డి వైపు గంజాయి విక్రయించేందుకు వస్తున్నారన్న సమాచారం మేరకు పట్టణ పోలీసులు వారిని పట్టుకోగా 600 గ్రాముల గంజాయి లభ్యమైనట్లు తెలిపారు. వీరితో పాటు బానోత్ శ్రీను, రాథోడ్ రవీందర్‌లను అదుపులోకి తీసుకున్నామని డీఎస్పీ రమేష్‌కుమార్ పేర్కొన్నారు. నిందితుల నుంచి రెండు బైక్‌లు, 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్ తరలించినట్లు చెప్పారు. పరారీలో ఉన్న మరో నలుగురు నిందితుల కోసం నాలుగు బృందాలుగా గాలిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ, రూరల్ సీఐలు ఎస్.శ్రీధర్‌రెడ్డి, సుధీర్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ వాసి మృతి

తూప్రాన్, జనవరి 9: అతివేగంగా వచ్చిన వాహనం ముందు వెళ్తున్న బైక్‌ను ఢీకొట్టడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు గాయపడ్డారు. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని బాపట్లకు చెందిన రాజశేఖర్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తున్నాడు. మంగళవారం పని మీద రాజశేఖర్, షేక్ జానీలు ద్విచక్ర వాహనంపై మాసాయిపేట మండలంలోని కంపెనీకి వచ్చారు. పనులు ముగించుకుని తిరిగి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. మార్గమధ్యలో మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై వెనుకగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహనంపై వెనుక కూర్చున్న రాజశేఖర్ కిందపడగా, తలమీదుగా వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న షేక్ జానీ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. మృతుడు రాజశేఖర్‌కు నాలుగు నెలల క్రితమే వివాహం జరిగినట్లు తెలిసింది. మృతదేహాన్ని తూప్రాన్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

కల్వర్టును ఢీకొట్టిన కారు, ఒకరి మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు, ఆస్పత్రికి తరలింపు



మృతిచెందిన అస్లాం

బెజ్జంకి, జనవరి 9: కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల జిల్లా ఇస్లాంపూరకు చెందిన మహ్మద్ అస్లాం(29) మంగళవారం శంషాబాద్ విమానాశ్రయానికి కారులో వెళ్లి వస్తున్నాడు. బెజ్జంకి క్రాసింగ్ రాజీవ్ రహదారి పక్కన ఉన్న కల్వర్టును కారు ఢీకొట్టింది. అస్లాం అక్కడికక్కడే మృతిచెందగా.. కారులో ప్రయాణిస్తున్న పాషా, సోయల్‌కు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు మోయిజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శంకర్‌రావు తెలిపారు.

మొబైల్ ఫోన్ పేలి గాయపడిన యువకుడి మృతి

తూప్రాన్, జనవరి 9: మొబైల్ ఫోన్ పేలి గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. మహారాష్ట్రలోని బండారా జిల్లా ఆలేసూర్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ బడిరాం ఇన్వాతి, సునీల్ మహదేవ్ ఖండలే(30), దుర్గేష్, రాజ్‌కుమార్, అశోక్, దీపక్ సుదాపర్గెర్‌లు తూప్రాన్ మండలం ఘనపూర్ శివారులోని శివం శంకరం క్రషర్‌లో పనిచేసేందుకు వచ్చారు. సోమవారం పనులు ముగించుకుని సాయంత్రం 6 గంటలకు కూరగాయలు తెచ్చుకోవడానికి క్రషర్ నుంచి ఘనపూర్ గ్రామానికి బయల్దేరారు. మార్గమధ్యలో సునీల్ మహదేవ్ ఖండలే మొబైల్ ఫోన్ తీసి టార్చ్ లైట్ వేస్తుండగా ఒక్కసారిగా పేలిపోయిందని వివరించారు. ప్రమాదంలో సునీల్ కుడివైపు పొట్టలో నుంచి పేగులు బయటకు వచ్చాయి. వెంటనే అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు తూప్రాన్ ఎస్‌ఐ శివానందం వివరించారు. మృతుడి బావమరిది జ్ఞానేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

జక్కాపూర్ విద్యార్థినికి మాచిరాజు బాలసాహిత్య పురస్కారం



భువనేశ్వరి

నారాయణరావుపేట, జనవరి 9: హైదరాబాద్‌కు చెందిన మాచిరాజు బాలసాహిత్య పీఠం ప్రకటించిన బాలసాహిత్య పురస్కారానికి నారాయణరావుపేట మండలం జక్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థిని దుబ్బాక భువనేశ్వరి ఎంపికైనదని ప్రధానోపాధ్యాయుడు సయ్యద్ షౌకత్ అలీ మంగళవారం తెలిపారు. మాచిరాజు బాలసాహిత్య పీఠం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ఉత్తమ కథలు రాసిన 20 మంది బాలలను ఎంపిక చేసిందని, భువనేశ్వరి రాసిన 'నమ్మిన వారికి ద్రోహం చేయకు' అనే కథకు పురస్కారం లభించిందని చెప్పారు. ఫిబ్రవరిలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న సమావేశంలో పురస్కారం అందిస్తారని తెలిపారు. విద్యార్థిని భువనేశ్వరిని, ప్రోత్సహించిన ఉపాధ్యాయులు భైతి దుర్గయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, జిల్లాకు చెందిన సాహిత్యవేత్తలు అభినందించారు.

బైక్‌ల దొంగ అరెస్టు

● నాలుగు బైక్‌లు, 26 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం

మెదక్ అర్బన్, జనవరి 9: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లను, గ్యాస్ సిలిండర్లను చోరీ చేసే ఘరానా దొంగను అరెస్టు చేసినట్లు మెదక్ పట్టణ సీఐ వెంకటేష్ తెలిపారు. మెదక్ పోలీసులు బోధన్ చౌరస్తాలో సోమవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఓ వ్యక్తి బైక్‌పై సిలిండర్ తీసుకొని వెళ్తుండగా.. వాహనపత్రాలు అడిగారు. స్పందన లేకపోవడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా.. దొంగతనం చేసినట్టు ఒప్పుకున్నాడు. నవంబరు, డిసెంబరు నెలలో మెదక్‌లోని చంద్రభవన్ వెంచర్‌తో పాటు చేగుంట, రామాయంపేట, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో గ్యాస్ సిలిండర్లు, బైక్‌లు దొంగలించినట్లు తెలిపాడు. అతని వద్ద నుంచి నాలుగు బైక్‌లు, 26 డొమెస్టిక్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్టు సీఐ వెల్లడించారు. కాగా నిందితుడు సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి గ్రామానికి చెందిన మామిడి శ్రీకాంత్ అని వివరించారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

శివ్వంపేట, జనవరి 9: కాలకృత్యాలకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. శివ్వంపేట మండలం బోజ్యతండాకు చెందిన రాములు(65) పింఛన్ కోసం సోమవారం చండి గ్రామానికి వెళ్లాడు. కానీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబీకులు మంగళవారం వెతుకుతుండగా చండి గ్రామ సమీపంలోని ఓ చెరువు వద్ద చెప్పులు, టవల్, పింఛన్ బుక్కు కనిపించడంతో అనుమానం వచ్చి వెతకగా.. రాములు మృతదేహం లభ్యమైంది. ఈ విషయం పోలీసులకు తెలపగా వారు వచ్చి వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మర్పడగ మల్లికార్జునుడికి అన్నాభిషేకం



కొండపాక, జనవరి 9 : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మంగళవారం మాస శివ రాత్రిని పురస్కరించుకుని మల్లిఖార్జున స్వామికి అన్నాభిషేకం నిర్వహించారు. క్షేత్ర నిర్వాహకుడు హరనాథ్ శర్మ ఆధ్వర్యంలో గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా లఘున్యాస పూర్వక విశేష పంచామృత ఫలరసాభిషేకం నిర్వహించి అన్నపూజ చేశారు.అనంతరం అన్న ప్రసాద వితరణ జరిగింది.

వాసవీమాతకు ఫల, పంచామృతాభిషేకం



అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

గజ్వేల్ రూరల్, జనవరి 9. గజ్వేల్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో నిర్వాహకులు సంప్రదాయబద్ధంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు శంకర శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో కొలువు దీరిన మూల విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పట్టు వస్త్రాలతో అలకరించారు. భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై వాసవీస్తోత్ర పారాయణం, పండ్లరసాలు, ప్రత్యేక జలాలతో పంచామృతాభిషేకం నిర్వహించి, హారతి ఇచ్చారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. విశేష అలంకారంలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కో ఆప్షన్ ఎస్, విజయలక్ష్మి సత్యనారాయణ, ఆలయ నిర్వాహకులు గోలి సంతోష్, కాశీనాథ్, శికకుమార్, గుడాల శేఖర్, ఉమేష్, జి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ అయోధ్య రాములోరి అక్షింతలు





మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్, అక్కన్నపేట మండలంలోని కట్కూర్ గ్రామంలో ఇంటింటికీ అయోధ్య అక్షింతలను పంపిణీ చేస్తున్న భక్తులు

మద్దూరు, జనవరి 9 : మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్‌లో మంగళవారం అయోధ్య రాముల వారి అక్షింతల్ని ఎంపీటీసీ ఇర్రి రాజేశ్వర్‌రెడ్డి, కొమురవెల్లి దేవస్థానం డైరెక్టర్ కామిడి రమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బందారం శ్రీనివాస్, బర్రె శ్రీనివాస్ రెడ్డి, నిమ్మ రవీందర్‌రెడ్డి, కొత్తపల్లి చంద్రయ్య, ఇరి త్రివేణి, నర్సింహారెడ్డి, లావణ్య, చేవల్ల లింగం, తుంగ పద్మ, గూడ సరోజన, మేఘమాల, బాలమ్మ, రఘు, గన్నిహరి పాల్గొన్నారు.

●**అక్కన్నపేట:** అక్కన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో మంగళవారం అయోధ్య అక్షింతలను శోభాయాత్రగా రామాలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జిల్లెల అశోక్‌రెడ్డి మాట్లాడుతూ అయోధ్య శ్రీరాముని అక్షింతలు గ్రామంలోని ఇంటింటికి పంపిణీ చేయడం అదృష్టమన్నారు. ఇందులో సింగిల్ విండో వైస్‌చైర్మన్ భూపతి ముకుందరెడ్డి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

పలుగుగడ్డలో కేసు నమోదు

జగదేవ్‌పూర్, జనవరి 9: మండలంలోని పలుగుగడ్డ గ్రామంలో మంగళవారం ఉదయం హనుమాన్ ఆలయంలో అయోధ్య అక్షింతలను ఉంచి పూజలు నిర్వహించారు. అనంతరం కొంతమంది గ్రామస్థులు యువకులతో కలిసి ఇంటింటికీ అక్షింతల పంపిణీని ప్రారంభించారు. కాగా ఆదేసమయంలో గ్రామ కుల సంఘం పెద్దమనిషి ఇస్తారి వచ్చి కుల సంఘం పెద్ద మనిషికి సమాచారం లేకుండా ఎలా పంపిణీ చేస్తారని వారితో వాగ్వాదానికి దిగారు. అనంతరం ఆ కుల సంఘం పెద్ద మనిషి కొడుకులు వచ్చి అక్షింతలను పంపిణీ చేస్తున్నవారితో ఘర్షణకు దిగడంతో అక్షింతలు పంపిణీ చేసే సభ్యులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయాన్ని సోషల్‌మీడియా ద్వారా తెలుసుకున్న ఎస్ఐ చంద్రమోహన్ గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను పిలిచి ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు అడిగి తెలుసుకుని, వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారు. ఈ విషయం తెలుసుకున్న బీజేవైఎం, భజరంగ్‌దళ్, హిందూధర్మ సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్‌కు అధిక సంఖ్యలో చేరుకుని అక్షింతలు పంపిణీ చేసేవారిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

అడిషనల్ డీసీపీ శ్రీనివాస్‌రావు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని జరిగిన విషయంపై పూర్తి వివరాలను తెలుసుకున్నారు. దాడి చేసినవారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

మల్లన్న ఆలయంలో అంతర్గత బదిలీలు

చేర్యాల, జనవరి 9: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఇటీవల స్వామివారి కల్యాణం సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలతో ఉద్యోగుల అంతర్గత బదిలీలు చేపట్టడంతో పాటు చెత్తసేకరణ ట్రాక్టర్ డ్రైవర్‌కు మెమో జారీచేసినట్లు ఆలయవర్గాలు తెలిపాయి. ఆలయ పరిసరాల్లో సేకరించిన చెత్త ట్రాక్టర్‌ను డంపింగ్ యార్డుకు తరలించకుండా మంత్రులు బస చేసిన గెస్ట్ హౌజ్ ఆవరణలో నిలిపారు. ట్రాక్టర్‌ను త్వరగా తీయాలని సూచిస్తూ మైక్‌లో అనౌన్స్ చేసినా సకాలంలో చేరుకోకపోవడంతో సంబంధిత అధికారులు ఆగ్రహం వ్యక్తంచేస్తూ చర్యలు తీసుకోవాలని ఆలయాధికారులను ఆదేశించారు. దీంతో ఆలయాధికారులు మంగళవారం ట్రాక్టర్ డ్రైవర్ తిరుపతికి మెమో జారీచేశారు. కాగా, ఆలయ ఉద్యోగులు కె.శ్రీనివాస్‌రెడ్డికి అన్నదాన సత్రంతో పాటు జాతర సమయంలో అన్నదాన నిర్వహణ బాధ్యతలు, ఎం. వెంకటాచారికి ప్రసాద తయారీ విభాగం, సందీప్‌కు గదుల విచారణ, బత్తిని నవీన్‌కుమార్‌కు శానిటేషన్ విభాగాన్ని కేటాయించారు. కంప్యూటర్ ఆపరేటర్ విద్యారెడ్డికి సెంట్రల్‌స్టోర్ సహాయకుతతో పాటు 100ప్రత్యేకదర్శన కౌంటర్ అదనపు బాధ్యతలు, ఎం. మధూకర్‌కు ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం, బి.అంజయ్యకు విద్యుత్ విభాగంతో పాటు ప్రత్యేక దర్శన టికెట్ కౌంటర్ అదనపు బాధ్యతలు అప్పగించారు.

పరుపులు మాయం!



రాత్రివేళ పరుపును తీసుకెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తి

కొమురవెల్లి మల్లన్న ఆలయానికి చెందిన పరుపులు మాయంచేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల స్వామివారి కల్యాణం సందర్భంగా తోట బావి ప్రాంగణంలోని కల్యాణ వేదికపై మంత్రులు, వీఐపీలు కూర్చునేందుకు వీలుగా పరుపులు ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవం అనంతరం సామగ్రిని స్టోర్ రూంకు తరలించారు. రాత్రివేళ గుర్తుతెలియని వ్యక్తులు గుట్టుచప్పుడుకాకుండా పరుపులను అపహరించి యూ-బిల్డింగ్ సమీపంలోని ఓ ప్రైవేటుగదిలో భద్రపరిచినట్లు గుర్తించారు. కాగా ఓ వ్యక్తి పరుపులను స్టోర్‌రూం నుంచి ప్రైవేటు గదికి తరలిస్తుండగా స్థానికులు ఫొటో తీశారు. ఈ విషయం మంగళవారం బహిర్గతం కావడం కలకలం రేపింది. అంతేకాకుండా ఆలయానికి చెందిన కుర్చీలను కూడా అదేగదికి తీసుకువెళ్లి సిట్టింగ్ చేస్తున్నారన్న ప్రచారం సాగుతుంది. అధికారుల సహకారం లేనిదే అపహరించడమెలా సాధ్యమవుతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదిలా ఉండగా గతంలో పలువురు తాత్కాలిక సిబ్బంది గొర్రెలు, కోడెలను అమ్ముకోవడంతో పాటు ప్లంబింగ్ సామాగ్రిని దొంగిలించినప్పటికీ ఆలయాధికారుల పట్టించుకోవడం లేదని, చివరకు పరుపులను కూడా వదిలిపెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై ఈవో బాలాజీశర్మను వివరణ కోరగా పరుపులను అపహరించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. కాగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

చిన్నకోడూరు, జనవరి 9 : మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కూర మాణిక్యరెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని తెలిపారు.

వరంగల్ ఎంపీ టికెట్ ఇవ్వాలని మాజీ ఎంపీపీ వినతి

చేర్యాల, జనవరి 9: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వరంగల్ ఎంపీ టికెట్‌ను తనకు కేటాయించాలని కోరుతూ చేర్యాల పట్టణానికి చెందిన మాజీ ఎంపీపీ రామగల్ల పరమేశ్వర్ మంగళవారం టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా హైదరాబాదు గాంధీభవన్‌లో ఆమె మర్యాదపూర్వకంగా కలిసి అభ్యర్థించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ పరిస్థితులపై అవగాహన ఉన్నందున తనకు అవకాశం కల్పించాలని కోరారు

సుప్రీంకోర్టు తీర్పు అభినందనీయం

కొండపాక, జనవరి 9 : బిల్కిస్ బాను కేసులో సుప్రీంకోర్టు సోమవారం సంచలనాత్మక తీర్పుతో ఇండియాలో ఉన్న సామాన్య ప్రజలకు న్యాయస్థానాల మీద గౌరవం ఏర్పడిందని న్యాయం గెలుస్తుందని దళితసేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాకి చంద్రబాను పేర్కొన్నారు. మంగళవారం దుద్దెడలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాను అవిశ్రాంత పోరాటం ఫలించిందని. అన్యాయంపై అహంకారంపై ఆమె విజయం సాధించిందని పీడితులకు తాడితులకు రాజ్యాంగం కల్పించిన చట్టాల ద్వారా న్యాయం జరుగుతుందని చంద్రబాను పేర్కొన్నారు.

నడి రోడ్డుపై విద్యుత్‌స్తంభం



చేర్యాల, జనవరి 9 : చేర్యాల పట్టణంలోని బాలవిద్యాజ్యోతి పాఠశాల సమీపంలో విద్యుత్ స్తంభం అత్యంత ప్రమాదకరంగా మారింది. రోడ్డువిస్తరణ పనుల్లో భాగంగా అది నడిరోడ్డుపైకి చేరింది. చీకటివేళలో స్తంభం కనిపించేలా ఇటీవల రేడియం స్టిక్కర్ అంటించినప్పటికీ గాలికి వేలాడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

సీఎంను కలిసిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం



సీఎంను కలిసిన ఉపాధ్యాయ సంఘం నాయకులు

కొండపాక, జనవరి 9: విద్యా వ్యవస్థలో పలు సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం విజ్ఞప్తి చేశారు. మంగళవారం సీఎంను హైదరాబాదులో రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం, రాష్ట్ర సహాయ ప్రధాన కార్యదర్శి పండుగ అంజయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీరాంశ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలు విజ్ఞప్తులు చేశారు. పాఠశాలలో సంఖ్యతో విద్యార్థుల నమోదుతో సంబంధం లేకుండా ప్రతీ ప్రాథమిక పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలని, ప్రతీ గ్రామ పంచాయతీ పరిధిలో ఒక ఆదర్శ పాఠశాల ఏర్పాటు చేసి ప్రతీ తరగతికి ఒక గది, ఒక ఉపాధ్యాయుడు, ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాలని కోరారు. అప్పుడే ప్రాథమిక స్థాయిలో ఆశించిన లక్షాలు సాధించగలుగుతామని పేర్కొన్నారు. పాఠశాలల పరిశుభ్రత కోసం సర్వీస్ పర్సన్‌ను నియమించాలని, ఉపాధ్యాయుల సర్దుబాటు విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల్లో చేయాలని, సబ్జెక్టు కొరత ఉన్న పాఠశాలల్లో తాత్కాలికంగా విద్యావలంటీర్లను నియమించాలని కోరారు. జీవో 317 ఉద్యోగ ఉపాధ్యాయ బాధితులకు న్యాయం చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ప్రాథమిక ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంలో భాగంగా పర్యవేక్షణ అధికారులుగా సీనియర్ ఎస్టీటీ ఉపాధ్యాయులను నియమించాలని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సీఎం సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలి





సీఎంను కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న సిద్ది పేట, దుబ్బాక నియోజకవర్గాల ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట టౌన్/చేగుంట, జనవరి 9: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని జిల్లాలోని ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జిలకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించినట్లు సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలో అసెంబ్లీ అభ్యర్థులుగా పోటీ చేసిన వారితో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంను సిద్దిపేట, దుబ్బాక నియోజకవర్గాల పార్టీ ఇన్‌చార్జిలు పూజల హరికృష్ణ, చెరుకు శ్రీనివాస్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాల్సిన బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జిలపై ఉందని, రాబోయే ఎంపీ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించినట్లు తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్నవారికి, నిజమైన అర్హులుగా గుర్తించినవారికి పథకాలు అందేలా చూడాల్సిన పూర్తి బాధ్యత నియోజకవర్గ ఇన్‌చార్జిలు తీసుకొని వారికి న్యాయం చేయాలని దిశానిర్దేశం చేశారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధుల కేటాయింపు, నియోజకవర్గంలోని పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

రాజకీయ దురుద్దేశంతోనే వినోద్‌కుమార్‌పై మంత్రి విమర్శలు

● మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్



హుస్నాబాద్, జనవరి 9: రాజకీయ దురుద్దేశంతోనే మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్‌పై రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అసత్యపు ఆరోపణలు చేస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ పేర్కొన్నారు. వినోద్‌కుమార్ తన అన్న కూతురు సరితారావు అనే యువతికి జెన్‌కోలో ఏఈ ఉద్యోగం ఇప్పించారని తప్పుడు ఆరోపణలు చేయడం బాధ్యతాయుతమైన మంత్రి పదవిలో ఉన్న పొన్నం ప్రభాకర్‌కు తగదని హితవు పలికారు. ఈ మేరకు ఆయన మంగళవారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. వినోద్‌కుమార్‌కు అసలు అన్ననే లేదని, ఇక అన్న కూతురు ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్నించారు. బోయినిపల్లి అనే ఇంటి పేరు ఉంటే బంధువు అయినట్టేనా అని పేర్కొన్నారు. తప్పుడు నిందలు వేసి రాజకీయ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు రాబోయే పార్లమెంట్ ఎన్నికలు కనిపిస్తున్నాయని, ఎమ్మెల్యే ఎన్నికల్లో మాట్లాడినట్లు అబద్దాలు మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేస్తే తాము కూడా దీటుగా స్పందించాల్సిఉంటుందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఎస్టీ రోడ్ల నిధులు, సీడీపీ నిధులు, ఇతర అభివృద్ధి కోసం మంజూరైన నిధులను రద్దు చేయించారని తెలిపారు.



మంత్రి పొన్నంను కలిసిన ములుగు మండల నాయకులు

పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలి

● రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్

ములుగు, జనవరి 9: త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు కార్యకర్తలు సైనికుల్లా పనిచేయడానికి సిద్ధంగా ఉండాలని రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్ వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ములుగు మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ అధ్వర్యంలో మంత్రిని కలిసి ములుగు మండలానికి సమయం ఇవ్వాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల కోసం కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కోరారు. అంతేకాకుండా పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీకి ఎవరు పోటీ చేసినా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకోవడం కోసం మనమంతా సైనికుల్లా పనిచేయాలని సూచించారు. మంత్రిని శేఖర్‌గౌడ్, ఏకాంబరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగం రామాచారికి అర్చకరత్న అవార్డు



ప్రశంసాపత్రం అందుకుంటున్న రామాచారి

కోహెడ, జనవరి 9: అర్చకరత్న నేషనల్ అవార్డుకు కోహెడ మండలం రాంచంద్రాపూర్ గ్రామానికి శ్రీసీతారామాంజనేయ ఆలయ అర్చకుడు శ్రీరంగం రామాచారి ఎంపికయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని నాచారంలో బహుజన సత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డు నేషనల్ కమిటీ చైర్మన్ బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ చేతుల మీదుగా అవార్డు పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహిత రామాచారి మాట్లాడుతూ శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో గత 30 ఏళ్లుగా అర్చకత్వం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో గోదావరి పుష్కరాల సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ ద్వారా ప్రశంసాపత్రం అందుకున్నట్టు తెలిపారు.

తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలు

హుస్నాబాద్ టౌన్, జనవరి 9: హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మంగళవారం తొలి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ జయంతి వేడుకలను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చదువుల తల్లి సావిత్రి బాయి పూలే సమకాలికురాలు ఫాతిమా షేక్ అని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్ ఒకే విద్యాసంస్థలో ఉపాధ్యాయ శిక్షణ పొందారన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మేకల వీరన్నయాదవ్, టీపీసీసీ కేడం లింగమూర్తి, ఎండీ హసన్, షబ్బీర్, ఆహ్మద్, రసూల్, యాకూబ్, చాంద్‌పాషా, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, గంపల శ్రీనివాస్, కాశబోయిన రవి, రవీందర్, బాలయ్య, రాజయ్య, రాంమోహన్ తదితరులున్నారు.

ఏఎంసీ మాజీ డైరెక్టర్ హన్మవ్వ మృతి

● సంతాపం తెలిపిన మాజీ మంత్రి హరీశ్‌రావు



మోతె హన్మవ్వ (ఫైల్)

నారాయణరావుపేట, జనవరి 9: మండలంలోని గోపులాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మోతె హన్మవ్వ అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. హన్మవ్వ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడమే కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం ఎంతగానో కృషి చేశారు. హన్మవ్వ మృతి పట్ల మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబానికి అండగా ఉంటానన్నారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు హన్మవ్వ భౌతికకాయానికి నివాళులర్పించారు.

బాధితులకు సెల్‌ఫోన్ల అప్పగింత

మద్దూరు, జనవరి 9: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురు బాధితులకు వారి ఫిర్యాదు మేరకు రికవరీ చేసి అప్పగించినట్టు ఎస్ఐ షేక్ యూనస్ అహ్మద్ అలీ తెలిపారు. ఈ విషయమై మంగళవారం ఎస్ఐ మాట్లాడారు. మద్దూరు తహసీల్దారు కార్యాలయంలో పనిచేసిన సీనియర్ అసిస్టెంట్ యాదగిరితో పాటు ధర్మారం గ్రామానికి చెందిన బొంగురం ఎల్లారెడ్డి సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ మేరకు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా ఆ ఫోన్లు దొరికిన వ్యక్తుల వివరాలను తెలుసుకుని స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు.

వారాంతపు సంతలో సెల్‌ఫోన్లు చోరీ

చేర్యాల, జనవరి 9: చేర్యాలలోని అంగడిబజారులో మంగళవారం జరిగిన వారాంతపు సంతలో గుర్తుతెలియని ఆగంతకులు పలువురి సెల్‌ఫోన్లను అపహరించారు. కూరగాయలు కొనుగోలు చేస్తున్నవారి నుంచి ఆగంతకులు ఫోన్లను కొట్టేశారు. ముగ్గురు బాధితులు ఈ విషయమై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగుల్లో పనిఒత్తిడిని తగ్గించడమే సంస్థ లక్ష్యం



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో వనభోజనంలో పాల్గొన్న సిబ్బంది

గజ్వేల్, జనవరి 9: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కార్మికులు, ఉద్యోగుల్లో పని ఒత్తిడిని తగ్గించడమే సంస్థ లక్ష్యమని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపోలో మంగళవారం వనభోజన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉద్యోగులకు మానసిక ఉల్లాసం, పని ఒత్తిడి తగ్గించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉద్యోగులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. వారితో అకౌంట్స్ ఆఫీసర్ రామకృష్ణారెడ్డి, ఎస్టీఐ కనకలక్ష్మి, ఏఎంఎఫ్ జమీల్, ఓస్ పాల్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

పీఆర్టీయూతోనే ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం



గజ్వేల్‌లో పీఆర్టీయూ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

గజ్వేల్, జనవరి 9: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం పీఆర్టీయూతోనే సాధ్యమని పీఆర్టీయూ మండలాధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ పట్టణంలోని ఆయా పాఠశాలల్లో పీఆర్టీయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీడీవో మచ్చేందర్, ఎంఈవో సునిత, మండల ప్రధాన కార్యదర్శి తిగుళ్ల లింగం, మండల నోడల్ అధికారి వై.కృష్ణ, కాంప్లెక్సు ప్రధానోపాధ్యాయులు ఎ.సుగుణాకర్, శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, శివశంకర్‌లతో కలసి ఆవిష్కరించారు. వారితో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలు చరణ్, రాష్ట్ర కార్యదర్శి పోచయ్యగౌడ్, బాస్కర్, నాగరాజు, వెంకటేశ్‌గౌడ్, నాగరాజు తదితరులున్నారు.

కోహెడలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



కోహెడలో నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

కోహెడ, జనవరి 9: ఉపాధ్యాయ సమస్యలు పీఆర్టీయూ సంఘంతోనే పరిష్కారం అవుతాయని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సురేందర్‌రెడ్డి, అన్నాడి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కోహెడలో పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు భాస్కర్‌రెడ్డి, పద్మ, ప్రధానోపాధ్యాయులు ఎండీ మహమూద్, డి కృష్ణారెడ్డి, మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దర్శనాల నారాయణ, కాశబోయిన ఓదెలు, జిల్లా బాధ్యులు కే లింగారెడ్డి, ఎం రాజు, ఏ అనిత, ఎస్ స్వప్న, పి విజయలక్ష్మి, పి లక్ష్మి, పి నగేష్, బి సంపత్, ఎం మనోహర్, జి. సద్గుణాచారి, కె.రామకృష్ణ, బి శ్రీరాములు, రాజిరెడ్డి, శ్రీనివాస్, సదానందం, రాజయ్య రమేష్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్దూరులో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ



మద్దూరులో టీఎస్ యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మద్దూరు, జనవరి 9: మండల కేంద్రంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో టీఎస్ యూటీఎఫ్ 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు రంగు రాజమల్లు, ప్రధాన కార్యదర్శి పల్లి రాజు, ఉపాధ్యక్షుడు రాజేశం, కోశాధికారి సంపత్, గౌరవ అధ్యక్షుడు హన్మారెడ్డి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

● **కొండపాక:** తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) సిద్దిపేట జిల్లా క్యాలెండర్‌ను దుద్దెడ స్కూల్ కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఎం.లక్ష్మి, టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తప్పెట్ల యాదగిరితో కలిసి మంగళవారం దుద్దెడ పాఠశాలలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పి.యాదగిరి, టీవీ రాధాకృష్ణ, యస్.ఉమరాణి, ఎం.కిరణ్మయి, జి.రజనీ, ఎస్.అరుణ, ఎం.భారతి, శ్రీదేవి, ఆర్ . ఉమారాణి,కె.హైమవతి, ఎన్.మాధవి, ఎం.జానకి పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా ఎదగాలి

● జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



కుట్టుమిషన్‌లు, సర్టిఫికెట్లు అందుకున్న మహిళలతో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, ఎంపీపీ మాణిక్యరెడ్డి

చిన్నకోడూరు, జనవరి 9: మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలని జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ పేర్కొన్నారు. చిన్నకోడూరు ఎంపీడీవో కార్యాలయంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో 90 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమానికి మంగళవారం సాయంత్రం ఆమె ఎంపీపీ మాణిక్యరెడ్డితో కలిసి హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. అనంతరం శిక్షణ పొందిన 32మంది మహిళలకు కుట్టు మిషన్‌లు, సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, సర్పంచ్ ఉమేష్ చంద్ర, ఏపీఎం మహిపాల్, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారత్ సంకల్ప్ యాత్ర



సంక్షేమ పథకాల పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న గ్రామస్థులు

గజ్వేల్ రూరల్, జనవరి 5, గజ్వేల్ మండలం బయ్యారం గ్రామంలో భారత్ సంకల్ప్ యాత్రను మంగళవారం సర్పంచ్ మద్దూరి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్థాయిలో కేంద్రం ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న ఆరోగ్యం, తదితర సంక్షేమ పథకాలను గ్రామస్థులకు వివరించారు. హెల్త్ క్యాంప్, గ్యాస్ లేని వారి నుంచి ఫ్రీ వంటగ్యాస్ కోసం అప్లికేషన్ తీసుకున్నారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

●**కొండపాక:** కుకునూరుపల్లి మండలం మంగోలు గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కిరణ్ కుమార్, కుకునూరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బల్బీర్ సింగ్, ఎం ఎల్ హెచ్ పి.ఉదయ్ కిరణ్, ఏఎన్ఎంలు విజయలక్ష్మి, నాగలక్ష్మి, పద్మ అంగన్ వాడి ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.